522) లలిత/భైరవి

ప॥ కానవచ్చీ గానరాదు కమలాక్ష నీమాయ । తానే వెంటవెంట దగిలీ నిదివో ॥

చ॥ తొల్లి నీవు గలవు తోడనే నేడు గలను । యెల్లగా నీప్రపంచము యింతా గలదు ।
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్టు । చల్లని నేనొకడనే జన్మములే వేరు ॥

చ॥ వేదములు నాటివే వినుకులు నాటివే । ఆదినుండి చదివే నదియే నేను ।
వేదతో వెన్నవట్టి నేయి వెదక బోయినయట్టు । దాదాత నాతెలివి యితరుల నడిగేను ॥

చ॥ వైకుంఠమూ నున్నది వరములు నున్నవి । యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను ।
కైకొని పువ్వు ముదిరి గక్కన బిందె యైనట్టు । నీకు శరణనగను నేనీడేరితిని ॥